
https://vijayamdaily.com
# విజయం
అక్షర సమరానికి నాంది..
పేజీలు : 6
ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం
గురువారం/జనవరి/12/2023
https://vijayamdaily.com









# ఖమ్మంపై నేతల.. ఫోకస్

- ప్రాంతీయ, జాతీయ పార్టీల కుర్చీలాట
- ఎవరి సత్తా ఏంటో చూపించుకునేందుకు ప్రయత్నాలు
- టీడీపీ, సీపీఎం పార్టీల బహిరంగ సభలు సక్సెస్
- ఈనెల 18 బీఆర్ఎస్ బహిరంగ సభ
- 26న భద్రాచలంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర ప్రారంభం
- ఫిబ్రవరిలో బీజేపీ బహిరంగ సభ
- ఎన్నికల ఫీవర్ గా మారిన ఉమ్మడి ఖమ్మం జిల్లా

(శివనాగిరెడ్డి, చంద్రుగొండ-విజయంన్యూస్)

ఒకప్పుడు కమ్యూనిస్టు ఖిల్లా.. వామపక్ష పార్టీలు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న నేల.. నక్సలైట్ పార్టీల హవా గా పేరు పొందిన జిల్లా.. జిల్లా కేంద్రం నుంచి సుమారు 250 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన అతి పెద్ద జిల్లా.. రానురాను ఆ పార్టీలు కనుమరుగై, ప్రాంతీయ పార్టీలకు గట్టి పునాది ఏర్పడిన జిల్లా.. ఈ ఖమ్మం జిల్లా.. తొలి,మలి దశ ఉద్యమాలకు ఊపిరి పోసిన చరిత్రలో లిఖిత మైన జిల్లా ఈ ఖమ్మం జిల్లా. అంతే కాదు..రాజకీయ చైతన్యం కలిగిన జిల్లా.. తెలుగు రాష్ట్రాల్లో గొప్ప పేరు గాంచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఎందరో మహానుభావులను చట్టసభలకు పంపించిన జిల్లా ఇది. జనాల నాడి పట్టిన నేతలేందరో ఉన్నారు.. అలాంటి వారిని కాదని జాతీయ, రాష్ట్రీయ రాజకీయాలకు నిలయంగా మారింది ఉమ్మడి ఖమ్మం జిల్లా.. అలాంటి జిల్లాపై ప్రధాన పార్టీలు ఒకేసారి ఫోకస్ పెట్టాయి. అందుకే ఈ జిల్లాపై రాజకీయ చదరంగం మొదలైంది..

మిగతా 2లో..

## భారత్‌లో బీఆర్ఎస్‌కు
# ఎదురులేదు

- కేంద్రంలో బీఆర్ఎస్ చక్రం తిప్పడం ఖాయం
- 5లక్షల జనంతో బహిరంగ సభను నిర్వహిస్తాం
- ప్రతి గ్రామం నుంచి జనం స్వచ్ఛందంగా తరలిరావాలి
- బీజేపీ నేతలకు వణుకుపుట్టడం ఖాయం
- ఖమ్మంలో పర్యటించిన మంత్రి తన్నీరు హరీష్ రావు
- మధిరలో సన్నాహక సమావేశంలో పిలుపునిచ్చిన మంత్రి హరీష్‌రావు





2లో



- నూతన కలెక్టరేట్ ను ప్రారంభించనున్న సీఎం
- కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించనున్న కేసీఆర్
- భారీగా ఏర్పాట్లు చేసిన పార్టీ నాయకులు
- కలెక్టరేట్ వద్ద భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

## నేడు భద్రాద్రికొత్తగూడెంకి
# సీఎం కేసీఆర్ రాక



(భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మంప్రతినిధి–విజయంన్యూస్)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని పాల్వంచ సమీపంలో నూతనంగా నిర్మాణం చేసిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించేందుకు రానున్నారు. ముందుగా హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో బయలుదేరనున్న సీఎం కేసీఆర్ మహబూబాబాద్ జిల్లాలో నూతనంగ నిర్మాణం చేసిన సమీకృత కలెక్టర్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం

మిగతా 2లో..

# ‘ఖమ్మం’పై నేతల ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

**జాతీయం ను తలదన్ని ప్రాంతీయం వైపు**

ఉమ్మడి ఖమ్మం జిల్లా జాతీయ పార్టీలకు నిలయంగా ఉండేది. కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టుల పోరుబాటలకు కేంద్రంగా ఉన్న ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లా చాలా కాలం పాటు కాంగ్రెష్, కమ్యూనిస్టులు శాంచించారు. అలాంటి ఉమ్మడి జిల్లా క్రమేమిపీ ప్రాంతీయ పార్టీలకు నిలయంగా మారింది.. కమ్యూనిస్టుల ప్రాభల్యం తగ్గిపోయి తెలుగుదేశం పార్టీకి ప్రాతినిధ్యం వచ్చింది.. దీంతో కాంగ్రెస్ వర్సస్ టీడీపీగా మారింది.. ఆ తరువాత టీడీపీ ప్రాబల్యం తగ్గి వైసీపీ పార్టీ తెరపైకి వచ్చింది.. ఒక ఎంపీ స్థానం, మూడు ఎమ్మెల్యేలు గెలుచుకునే స్థాయికి చేరింది. అంతలోనే మరో ఎన్నికలు వచ్చే నాటికి వైసీపీ పతనమై టీడీపీ పార్టీ పుంజుకుంది..అయితే ప్రస్తుతం టీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో బలంగా ఉంది. ఇతర పార్టీల నుంచి నేతలను లాగేసుకున్న ఆ పార్టీ స్థానిక ఎన్నికల నాటికి బలమైన పార్టీగా మారింది.. అంటే జాతీయ పార్టీలను తలదన్ని ప్రాంతీయ పార్టీలకు పట్టం గట్టింది ఉమ్మడి ఖమ్మం జిల్లా..? ఈ జిల్లాలో మొత్తం పది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువ. ఉమ్మడి రాష్ట్రంలో లెఫ్ట్ కూటమితో జత కట్టి జిల్లాలో టీడీపీ బలంగా కనిపించేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటింది. 2014లో జిల్లాలో టీఆర్ఎస్‌కు దక్కింది ఒకే ఒక సీటు. 2018లోనూ అదే పరిస్థితి. రాజకీయ కారణాలతో వివిధ పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కారెక్కేసినా.. ఎన్నికల ముఖచిత్రం చెప్పే లెక్కలు వేరు. ఈసారి ఎలాగైనా పాగా వేయాలని టీఆర్ఎస్ పావులు కదుపుతుంటే.. పట్టు నిలుపుకొనేందుకు కాంగ్రెస్ చూస్తోంది. ఈ రెండు పార్టీల వార్ ఇలా ఉంటే.. కొత్తగా బీజేపీతోపాటు షర్మిల పార్టీ సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాపైనే కన్నేశాయి. గత కొన్ని నెలల క్రితం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన చంద్రబాబు సైతం.. జిల్లాలో టీడీపీ పుంజుకునేందుకు సానుకూల వాతావరణం ఉందని ప్రకటించారు. అందుకే ప్రధాన పార్టీ ఎత్తుగడలు మిషన్ ఖమ్మం రాజకీయాలను ఆసక్తిగా మలుస్తున్నాయి...

**ఖమ్మం జిల్లాపై నజర్ పెట్టిన సీఎం కేసీఆర్**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆర్ఎస్ పార్టీ అంతగా సక్సస్ కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక విధమైన ఫలితాలు వస్తే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక రకమైన ఫలితాలు వచ్చాయి. రెండు సార్లు ఎన్నికలు జరిగి, టీఆర్ఎస్ కు భారీగా స్థానాలు వచ్చినప్పటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్కటే విజయం సాధించాయి. 2014 లో పది స్థానాలకు ఒక జలగం వెంకట్రావు విజయం సాధించగా, 2018 ఎన్నికల్లో పది స్థానాలకు పువ్వాడ అజయ్ కుమార్ ఒక్కడే విజయం సాధించారు. దీంతో సీఎం కేసీఆర్ నజర్ పెట్టారు. ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో అభివద్ధిపై కన్నేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు భారీగా నిధులు మంజూరు చేశారు. అయితే ఇటీవలే జాతీయ రాజకీయాలకు ఎంట్రీ ఇచ్చిన సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాపై నజర్ ప్రకటించారు. అందులో భాగంగానే ఈనెల 18న బారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అవిర్భవ వేడుకలను నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సమావేశానికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పార్టీ నుంచి ఇతర పార్టీలకు వలస ఎటల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ఖమ్మం జిల్లాపై సీఎం కేసిఆర్ పోకస్ పెట్టారు.

**నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్..?**

కాంగ్రెస్ పార్టీ జిల్లాలో అతిపెద్ద పార్టీ.. ఎంతో మంది అద్భుతమైన నాయకత్వాన్ని అందించిన పార్టీ. ఈ జిల్లా నుంచి ముఖ్యమంత్రిని అందించిన పార్టీ. పదుల సంఖ్యలో ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను చేసిన పార్టీ. కేంద్రమంత్రులను, రాష్ట్రంలో కీలక మంత్రులను అందించిన పార్టీ. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా, రేణుక చౌదరి కేంద్రమంత్రిగా, శీలం సిద్దారెడ్డి, జలగం ప్రసాద్ రావు, వనమా వెంకటేశ్వరరావు, సంబాని చంద్రశేఖర్, రాంరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి వాళ్లను మంత్రులుగా పనిచేయించిన పార్టీ.. ఇప్పుడు నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతుంది.ఇప్పటి వరకు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క్ కాంగ్రెస్ పార్టీని భుజాన వేసుకుని నడిపిస్తున్నారు. రేణుక చౌదరి అమవాస్య, పౌర్ణమి అన్నచందంగా ఆరునెలలకు, మూడు నెలలకోకసారి అతిథిలా వచ్చి వెళ్తున్నారు.. సంభాని చంద్రశేఖర్ తన ప్రాభల్యం తగ్గిపోయింది.. తన సీటు తాను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.. రాంరెడ్డి వెంకట్ రెడ్డి మరణంతో ఆ కుటుంబం జిల్లాలో కనుమరుగైయ్యారు. ఇక మిగిలింది భట్టి విక్రమార్క ఒక్కరే. ఆయన పై కొన్ని విమర్శలు ఉన్నాయి.. స్థానికంగా నాయకత్వం కొంత మంది విమర్శలు చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ నుంచి గెలిచిన కొందరు టీఆర్ఎస్‌లోకి వెళ్లిపోతున్న పరిస్థితి ఏర్పడింది.. వారిని కాపాడేవారే కరువైయ్యారు. దీంతో . రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉన్న జిల్లాల్లో ఆధిపత్య పోరు కారణంగా రాను రాను పార్టీ బలహీన పడుతుందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**బల నిరూపణలో టీడీపీ**

ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు దడదడలాడించిన తెలుగుదేశం పార్టీ.. ఇప్పుడు కనుమరుగైంది.. గత ఎన్నికల్లో సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావులు ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికి వారు టీఆర్ఎస్ గూటిలో చేరిపోవడంతో తండ్రిలేని కుటుంబంగా మారింది.టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు జిల్లాలో ఉద్దండులైన నాయకులు ఉన్నారు. ప్రస్తుతం టీఆర్ఎస్‌లో ఉన్న కొందరు గతంలో ఇదే జిల్లాలో టీడీపీ నుంచి గెలిచిన వాళ్లే. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తెలంగాణలో గెలిచిన రెండే రెండు సీట్లు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే. అశ్వారావుపేట.. సత్తుపల్లిలో టీడీపీ పాగా వేసినా.. తర్వాతి కాలంలో ఎమ్మెల్యేలు సండ్ర వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావులు అభివృద్ధి పేరిట గులాబీ గూటికి వెళ్లిపోయారు.

ఏపీ రాజకీయాలపై చంద్రబాబు ఎక్కువగా ఫోకస్ పెట్టడంతో తెలంగాణలో సైకిల్ చతికిల పడింది. ఆ ప్రభావం ఖమ్మంజిల్లాలోనూ కనిపించింది. తాజాగా గత కొంతకాలం క్రితం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన చంద్రబాబు.. అక్కడ జనాల స్పందన చూశాక కొత్త లెక్కలు వేసుకున్నారు . ఖమ్మం జిల్లా నుండి రాష్ట్రం మొత్తం ఈ జిల్లా నుండి కార్యాచరణ టీడీపీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమై.. టీడీపీ పుంజుకునేందుకు అవకాశాలు ఉన్నాయని, అంతటితో ఆగకుండా, ప్రతి జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని తెలంగాణ పార్టీ అధినాయకత్వానికి సూచించారు. అనుకున్న విధంగానే గత నెల 21న ఖమ్మంలో భారీ బహిరంగ నిర్వహించి టిడిపి పార్టీ శ్రేణులకు దశ దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని స్థానంలో పోటీ చేస్తుందని ఖమ్మం బహిరంగ సభలో తెలియజేశారు. అయితే ప్రస్తుతం టీడీపీ పార్టీ అధినేత మరోసారి ఉమ్మడి ఖమ్మంపై నజర్ పెట్టారు. తన ప్రాంత ప్రాభల్యంను దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగానే ఖమ్మంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయగా, ఆ సభ సూపర్ సక్సెస్ అయ్యింది.. దీంతో టీడీపీ మళ్లి పుంజుకునే అవకాశం లేకపోలేదు.

**అసంతృప్తి నేతలపై ఫోకస్ పెట్టిన బిజెపి...**

ఇక జిల్లా బీజేపీ నేతలు సైతం జిల్లాలో బలం పెంచుకోవాలని చూస్తున్నారు. సంస్థగతంగా జిల్లాలో పెద్దగా క్యాడర్ లేని పార్టీగా, బలమైన నాయకత్వం లేకపోవడంతో జిల్లాలో బిజెపి ప్రభావం చాలా తక్కువ. ఇలాంటి తరుణంలో టీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న నేతలకు వల వేయాలని అనేక ప్రయత్నాలు బీజేపీ నేతలు చేస్తున్నారు. అలా మాజీ ఎంపీ పొంగులేటికి, తుమ్మల నాగేశ్వరావు గాలం వేశారని ప్రచారం జరుగుతుంది. అయితే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీజేపీలో చేరేందురు రంగం సిద్దమైంది. అంతే కాకుండా వచ్చే నెలలో ఖమ్మంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి వేలాధి మంది సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్దం చేసుకున్నారు. ఎమ్మెల్యే స్థాయి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, ప్రస్తుత చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇలా ముఖ్యమైన నాయకత్వం మొత్తం ఆ రోజు పార్టీలో చేరే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఖమ్మం నుంచే ప్రారంభించాలని భావిస్తున్న బీజేపీ పార్టీ అందుకు కావాల్సిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఏది ఏమి జరిగినా జిల్లాలో నానాటికి రాజకీయ సమీకరణాలు రోజుల విధంగా మారుతున్నాయి. రాష్ట్రస్థాయి బిజెపి నేతలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లా పై ప్రత్యేక దృష్టి పెట్టారని జిల్లాస్థాయి నాయకులు చర్చించుకోవడం గమహర్షం. ఏది ఏమి జరిగినా ఖమ్మం జిల్లాలో ఎవరి మిషన్ పని చేస్తుందో మరి కొద్ది నెలల్లో తెలుస్తుంది.

**పాలేరు నా అడ్డా అంటున్న షర్మిల...**

రాజకీయంగా నిలుదొక్కుకోవాలని చూస్తున్న వైఎస్ షర్మిల సైతం వైఎస్ఆర్‌టీపీని ఖమ్మంలోనే ప్రారంభించారు. జిల్లాలో విస్తృతంగా పాదయాత్ర చేసిన షర్మిల.. వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేయడానికి చూస్తున్నారు. పాలేరులో పోటీ చేస్తే ఆ ప్రభావం మరికొన్ని నియోజకవర్గాల్లో ఉంటుందని.. పార్టీకి తొలి ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని షర్మిల అండ్ కో ఆలోచన. 2014లో వైసీపీకి ఇదే జిల్లాలో ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యే సీట్లు దక్కాయి. ఆ కోణంలోనూ జిల్లాపై ఆశలు పెట్టుకున్నారు షర్మిల.

## నేడు భద్రాద్రికొత్తగూడెంకి సీఎం కేసీఆర్ రాక

(మొదటిపేజీ తరువాయి)

మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించనున్నారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడి భవిష్యత్ లో పార్టీ, ప్రభుత్వ భవిష్యత్ వివరాలను తెలియజేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు హెలికాప్టర్ ద్వారా భద్రాద్రికొత్తగూడెంకు చేరుకోనున్నారు. అక్కడ నుంచి నేరుగా పాల్వంచలోని నూతనంగా నిర్మాణం చేసిన కలెక్టరేట్ భవనంను ప్రారంభించి, అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొననున్నారు. అనంతరం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించి, అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ కు చేరుకోనున్నారు.

**భారీగా ఏర్పాట్లు**

భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, బహిరంగ సభ వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ అనుదీఫ్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు**

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో నేడు సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేయగా, ఆ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరిశీలించి, వివరాలను తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ విఫ్, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

## భారత్‌లో బీఆర్ఎస్‌కు ఎదురులేదు

(మధిర, ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

భారత్ లో బీఆర్ఎస్ పార్టీకి ఎదురులేదని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎవరు ఊహించని విధంగా అద్భుతమైన ఫలితాలు రాబోతున్నాయని, మీ అందరికి అద్భుతమైన అవకాశాలు వస్తాయని రాష్ట్ర అర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఈనెల 18న బీఆర్ఎస్ పార్టీ అవిర్భావ మొదటి బహిరంగ సభను ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభకు భారీగా జనం తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి హరీష్ రావు కోరారు. బుధవారం ఈ నెల 18న ఖమ్మంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ తోలి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, జడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివద్ది చేసిన సీఎం కేసీఆర్, భారత దేశ రాజకీయాలను శాసించే విధంగా ఆయన జాతీయ రాజకీయాలకు వెళున్నారని తెలిపారు. భారతదేశంలో ఓ మతతత్వ పార్టీ దేశాన్ని విచ్ఛన్నం చేసే పనిలో నిమగ్నమైందని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ నేతలు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుతున్నారని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్రంలో అనేక విధాలుగా అరాచకాలకు దిగుతుందని, అలాంటి మత విద్వేలను రెచ్చగొట్టే పార్టీలను తరిమికొట్టాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. భారత దేశ అభివద్దిని వదిలేసి ప్రధాని ప్రభుత్వాలే లక్ష్యంగా ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ విచ్చినకర శక్తులతో, కార్పోరేట్ శక్తులతో కుమ్మక్కై భారతదేశ భవిష్యత్ ను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఆ పార్టీ అవిర్భవ బహిరంగ సభను తొలిసారిగాఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేస్తున్నారని, ఈ సభకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రెండు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రధాన పార్టీలన నాయకత్వం ఈబహిరంగ సభకు ముఖ్యఅతిథిలుగా హాజరవుతున్నారని తెలిపారు. అందుకే ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతిగ్రామం నుంచి ప్రజలందరు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, బహిరంగ సభకు సుమారు 5లక్షల మంది హాజరై దేశానికి బీఆర్ఎస్ అవిర్భవ సభ నాంధిగా మారాలని కోరారు. ఈ సభను చూస్తే బీజేపీ నాయకులకు వణుకు పుట్టాలని, బీజేపీ నేతల్లో భయం కల్గి రాష్ట్రాన్ని వదిలేసి పారిపోయే విధంగా ప్రజలు ఈ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

**ఊరికి 300మంది తరలిరావాలి: మంత్రి పువ్వాడ**

ఖమ్మంలో ఈనెల 18న జరిగే బీఆర్ఎస్ బహిరంగసభ ను ఊరికి 300 చొప్పున ప్రజలు తరలిరావాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సభకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ తో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు హాజరవుతున్నారని, ఈ సభకు ఎనలేని జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు తదితరులు.

# ఖమ్మంలో భారీ బహిరంగ సభ

-ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్,అధికారులు

-సభ స్థలాన్ని, నూతన కలెక్టర్ భవనాన్ని పరిశీలించిన మంత్రులు



(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ఖమ్మంలో ఈనెల 18న సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా, బీఆర్ఎస్ పార్టీ అవిర్భవ మొదటి బహిరంగ సభను నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్ రావు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గురువారం పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మంకు చేరుకున్న మంత్రి తన్నీరు హరీష్ రావు కు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ వి.పి.గౌతమ్, సీపీ విష్ణు.ఎస్.వారియర్ బుకెలను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం సభాస్థలానికి వెళ్లిన మంత్రి తన్నీరు హరీష్ రావు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతామధుసూదన్, ఎమ్మెల్యే రాములు నాయక్ తదితరులు సభాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ సభాస్థలానికి సంబంధించిన పూర్తి మ్యాఫ్ చూపించిన తరువాత కొన్ని మార్పులు చేర్పుల విషయంలో సలహాలను అందించారు. సబా వేదిక, జన సమీకరణకు సంబంధించిన 25 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. మొత్తం కలియతిరిగారు. అధికారులు కలెక్టరేట్ భవన నిర్మాణం, వివిధ శాఖలకు





సంబంధించిన రూముల కేటాయింపు, సభావేదికలు, గ్రీవెన్స్ డే అన్నింటిని అద్భుతంగా తయారు చేసినట్లు తెలిపారు.

### కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీష్ రావు

కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవ ఏర్పాట్లు ఘనంగా చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. బుధవారం మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సముదాయంలో గదులు పరిశీలించి, కార్యక్రమ నిర్వహణకు ఏది



అనుకూలంగా ఉంటుందో సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు వివరించారు. కంటి వెలుగు కార్యక్రమ ప్రారంభోత్సవం, కార్యక్రమంలో పరీక్షలకు ప్రజల సేకరణపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, కమీషనర్ శ్వేతా మహంతి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనర్లు ఏవి. రంగనాథ్, విష్ణు ఎస్. వారియర్, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు జి. శ్రీనివాసరావు, టీఎస్ఎంఐడిసి ఎండి చంద్రశేఖర్, అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, ప్రజాప్రతినిధులు,

## తొలి బహిరంగ సభను విజయవంతం చేయాలి.

### ఎమ్మెల్యే సండ్ర, సుదర్శన్ రెడ్డి పిలుపు.

**తల్లాడ జనవరి 12 విజయం న్యూస్:**

తల్లాడలో మండల నాయకత్వంతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, నర్సంపేట శాసనసభ్యులు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందిన తర్వాత నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించటం బిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్త జిల్లాకు పార్టీ ఇచ్చిన గౌరవంగా భావించి బహిరంగ సభను భారీ జన సమీకరణతో విజయవంతం చేసే దిశగా పార్టీ నాయకత్వం పనిచేయాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఖమ్మం సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి, అనంతరం జాతీయ బిఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించుకోవడం, ఈ సభలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ఈ సభలో ప్రతి కార్యకర్త భారీ జన సమీకరణతో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తల్లాడలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పార్టీ నాయకత్వానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ పరిశీలికులుగా విచ్చేసిన నర్సంపేట శాసనసభ్యులు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకత్వం సామర్థవంతంగా పనిచేసి సభ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు




## అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా

### కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు -ఏసీపీ వెంకటేష్




**ఏన్కూరు, జనవరి 11 (విజయం న్యూస్)**

సత్తుపల్లి డివిజన్ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని ఏసీపీ వెంకటేష్ తెలిపారు. బుధవారం ఏసీపీ విజయం న్యూస్ తో మాట్లాడుతూ..... కోడి పందాలు, జూదం, పేకాట తదితర కార్యక్రమాలు నిర్వహించే వారి పైన, ప్రోత్సహించే వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఏసిపి వెంకటేష్ హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ అని ప్రజలు సహకరించాలని కోరారు. సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలందరూ ఆనందోత్సవాల తో జరుపుకోవాలని ఏసిపి వెంకటేష్ కోరారు.

## నాచారం దేవస్థానం చైర్మన్ పదవి ఆదివాసిలకు ఇవ్వాలి



**ఏన్కూరు, జనవరి 11 (విజయం న్యూస్)**

ఏన్కూరు మండలం నాచారం శ్రీశ్రీశ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పదవిని నాచారం ఉమ్మడి గ్రామపంచాయతీలో ఉన్న ఆదివాసిలకు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఆదివాసీలు వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలకు అనుగుణంగా చైర్మన్ పదవి గిరిజనులకు ఇవ్వాలని కోరారు. ఇప్పుడు ఎన్నుకుంటున్న పాలకవర్గాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో ఎన్నుకునే పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ఆదివాసీలు హెచ్చరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్లు మల్లేశ్వర రావు, రాంబాబు సంఘం నాయకులు వెంకులు, నరసింహ, సుధీర్, గంగులు, నాగరాజు, దిలీప్, కిరణ్, సంత్ తదితరులు పాల్గొన్నారు.

## గార్లఒడ్డు దేవాలయాన్ని సందర్శించిన శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

**ఏన్కూరు, జనవరి 11 (విజయం న్యూస్)**


శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి ఆశ్రమం, దివ్యసాకేతం, శ్రీరామనగరం, సమతామూర్తి కేంద్రం, శంషాబాద్, హైదరాబాద్ నుండి శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామివారు గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని బుధవారము సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీ శేషయ్య, అర్చకులు శ్రీమాన్ బీటుకూరి వేణుగోపాలాచార్యులు, నాగరాజాచార్యులు, కిరణ్ కుమారాచార్యులు, పొడిచేటి రామకృష్ణమాచార్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జీయర్ స్వామివారు అర్చకులకు, సిబ్బందికి, భక్తులకు మంగళాశాసనములు చేశారు. ఈ సందర్భంగా వారు గతంలో 2016 లో ఈ ఆలయాన్ని సందర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకొని నాటికి, నేటికీ ఆలయం ఎంతో అభివృద్ధి సంతరించుకోవడాన్ని చూసి ప్రశంసించారు... అలాగే శ్రీరామనవమి తరువాత ఒక రోజున శ్రీశ్రీశ్రీ చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి అనుమతితో శ్రీ స్వామివారి ఆధ్వర్యంలో భక్తుల శ్రేయస్సు కోరి శ్రీ సుదర్శన నారసింహ హవనం జరుపుటకు వారు సంసిద్ధత తెలియజేశారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకొని వివరాలు తెలియజేయవల్సిందిగా ఆలయ ఈ.వో. శేషయ్యకు పలు సూచనలు ఇచ్చారు.



# స్వతంత్ర పోరాట యోధుడు 'వడ్డే ఓబన్న'

**-వడ్డెర సంఘ సంక్షేమానికి రూ.10లక్షలు**

**-సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**



సత్తుపల్లి, జనవరి 11: ఆనాటి రేనాటి సీమ, ఈనాటి రాయలసీమ ప్రాంతంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన స్వతంత్ర పోరాటంలో కోయిలకుంట్ల రాజ్యాధిపతి సైరా నరసింహారెడ్డి సేనాధిపతి వడ్డెర జాతి వీరుడు, స్వతంత్ర పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పేర్కొన్నారు. సత్తుపల్లి వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ సమీపంలో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని వెంకట వీరయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1845 నుండి 1847 వరకు రెండు సంవత్సరాలు రాయలసీమ ప్రాంతం నుండి ఆంగ్లేయుల పాలన అరాచకాలను వ్యతిరేకించి, అనేక సందర్భాల్లో జరిగిన పోరాటాలలో వడ్డే ఓబన్న పరాక్రమం, అతని మరణం చిరస్మరణీయమని, అలాంటి మహనీయుని విగ్రహం సత్తుపల్లిలో వడ్డెర సంఘం ఏర్పాటు చేయడం, అభినందనీయమన్నారు. అనంతరం సత్తుపల్లి వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర కులాన్ని ఎస్టీ తెగల జాబితాలో చేర్చాలని, అందుకు శాసనసభ తీర్మానం జరిపి అభిప్రాయాన్ని పార్లమెంటుకు తెలియపరచాలని, ఇందుకు శాసనసభ్యులు కృషి చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కుసుంపూడి మహేష్, మండల పరిషత్ అధ్యక్షులు దొడ్డ హైమావతి, వార్డు కౌన్సిలర్లు అద్దంకి అనిల్, గుండ్రా రఘు, మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి,స్వచ్ఛంద సంస్థల సమన్వయకర్త చిత్తలూరు ప్రసాద్, సత్తుపల్లి వడ్డెర సంఘం అధ్యక్షులు ఉప్పు హనుమంతరావు, కృష్ణుడు గుడి కమిటీ అధ్యక్షులు గుంజ వెంకటేశ్వరరావు, వడ్డెర సంఘ నాయకులు దేవుళ్ళ శ్రీను, దేవళ్ల పెద్దిరాజు, గుంజ వెంకట్రావు, వేముల వెంకటేశ్వరరావు, గుంజ లక్ష్మణరావు, వేముల మారేష్, చల్లా వెంకటేశ్వరావు, తిరుపతి శీను, తన్నీరు ఆదినారాయణ, తన్నీరు జమలయ, ఒంటిపులి సాంబయ్య, తురక వెంకటేశ్వర్లు, వల్లపు మహేష్, బత్తుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం కెసిఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

**బూర్గంపహాడ్ మండల జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత**

**బూర్గంపహాడ్, డిసెంబర్ 11(విజయం న్యూస్ )**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు బుధవారం బూర్గంపహాడ్ మార్కెట్ యార్డ్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ సమావేశం లో సిఎం కెసిఆర్ బహిరంగ సభను జయప్రదం చేయటానికి ప్రతి పంచాయతీ పరిధిలో గల కార్యకర్తలు తగిన కృషి చేయాలని చర్చించటం జరిగింది, ప్రతిఒక్కరు తమ పంచాయతీ పరిధి గల ప్రజలకు చైతన్య కలిగించి అధికాసంఖ్యలో ప్రజలు పాల్గొని సిఎం కెసిఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని నిర్ణయించుకున్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ గోపిరెడ్డి రమణారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, మండల యూత్ ప్రెసిడెంట్ గోనెల నాని, రెడ్డిపాలెం సర్పంచ్ భూక్యా శ్రావణి, వేపలగడ్డ సర్పంచ్ కుంజ చిన్నబ్బాయి, కృష్ణ సాగర్ సర్పంచ్ పొదిమే వెంకటేశ్వర్లు, నియోజకవర్గ పరిశీలకులు మేడం లక్ష్మి నారాయణ రెడ్డి ,సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, గ్రామాకమిటి అధ్యక్షులు, మండల నాయకులు, అనుబంధసంఘ నాయకులు, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# యువత క్రీడలలో రాణించాలి.

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా.**

అశ్వాపురం, జనవరి 11,(విజయం న్యూస్)



మండల కేంద్రంలో కొమురం భీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.తొలిత కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, బ్యాటింగ్ చేసి క్రీడాకారులలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. క్రీడాకారులు ఆటలో నైపుణ్యాన్ని ఒడిసి పట్టి విజయాలు సాధిస్తూ, క్రీడలు వలన అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభను చాట వచ్చు అన్నారు. యువత క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు. అనంతరం జరిగిన మొదటి మ్యాచ్ లో సీతారాంపురం, అశ్వాపురం ఎమ్మార్పీఎస్ జట్లు తలపడగా అశ్వాపురం ఎమ్మార్పీఎస్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది .ఈ



కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, మర్రి మల్లారెడ్డి, కందుల కృష్ణార్జునరావు, పినపాక నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్నె అశోక్ కుమార్, గజ్జల లక్ష్మారెడ్డి, సూది రెడ్డి గోపిరెడ్డి, గద్దల రామకృష్ణ, నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## తల్లాడలో గంజాయి పట్టివేత.

**తనిఖీలు భాగంగా పట్టుకున్న ఎస్ఐ సురేష్.**



**తల్లాడ జనవరి 12 విజయం న్యూస్:**

ఖమ్మం జిల్లా తల్లాడలోని వెంకట పద్మావతి రైస్ మిల్ ఎదురుగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 18 కేజీల గంజాయిని బుధవారం ఎస్సై సురేష్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లోని భాగంగా సాయంత్రం 4:30గంటలకు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఏన్కూర్ నుండి తల్లాడకు వెళుతున్న ఆటోలో 18 కేజీల గంజాయి పట్టుకొని స్థానిక ఎమ్మార్వో ఘంటా శ్రీలత ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఆటోలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిని విచారించగా మాది చింతూరు అని, ఈ గంజాయిని ఒరిస్సా సరిహద్దు నుండి తీసుకొని వస్తున్నామని తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ ఎవరైనా ఇటువంటి వాటికి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది తెలిపారు.

## ఏఎస్సై ను సన్మానించిన సర్పంచ్ సీతారామిరెడ్డి.



**తల్లాడ జనవరి 12 విజయం న్యూస్:**

తల్లాడ పోలీస్ స్టేషన్ లో ఏఎస్సైగా పదోన్నతి పొందిన సాంబశివరావును మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ ఓబుల సీతారామిరెడ్డి సన్మానించారు. బుధవారం తల్లాడలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయనను శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఆయనతోపాటు తల్లాడ ఎస్సై పి. సురేష్ కు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బండి బాలశౌరి, ప్రభాకర్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## సృజన బాల సాహిత్యం జిల్లా శాఖా గ్రంధాలయాలకు అందచేత

సత్తుపల్లి, జనవరి 11: సృజన సాహితీ సమాఖ్య ఆద్వర్యంలో ప్రచురించిన బాల సాహిత్యాన్ని ఖమ్మం జిల్లా గ్రంధాలయ అధ్యక్షులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మంజువాణిలకు అందచేసారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సృజన సభ్యులు మధుసూదన రాజు రాసిన పుస్తకాలు మల్లెల మనసులు, తాత చెప్పిన కథలు, ఆనంద నంది వర్ధనాలు, సృజన ద్వి దశాబ్ది సంచికలతో పాటు సత్తుపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రచురించిన బడి గంటలు పుస్తకాలను అందచేశారు.ఖమ్మం జిల్లాలోని 18 శాఖా గ్రంధాలయాలకు వీటిని అంద చేయవలసినదిగా కోరారు.ఈ సందర్భంగా కొత్తూరు ఉమా మహేశ్వర రావు,మంజువాణీ మాట్లాడుతూ పిల్లల భాష, మనో వికాసాల కోసం బాల సాహిత్యాన్ని ప్రచురిస్తున్న సృజనను అభినందించారు. కార్యక్రమంలో మధుసూదన రాజు, జి.రామకృష్ణ, పి.నాగేశ్వరరావు, సత్తుపల్లి గ్రంధ పాలకులు మల్లికార్జున రావు, జిల్లా శాఖ సిబ్బంది అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



vijayam_daily vijayam_telugu vijayam_news విజయం

# కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**-అధికారులకు సూచించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ మూర్తుజా రిజ్వీ**

**ఖమ్మం, జనవరి 11(విజయంన్యూస్):**
కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకులు డా. జి. శ్రీనివాసరావు లతో కలిసి వైద్యాధికారులతో కంటి వెలుగు కార్యక్రమ అమలుపై కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమం చాలా కాలం నిర్వహించినట్లు, ఇప్పుడు రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం 100 పని దినాలలో చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. ఖమ్మం జిల్లాలో 55 కంటి వెలుగు బృందాలు ఏర్పాటుచేసినట్లు, అన్ని బృందాలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. బృందాలన్నింటికి శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేయాలన్నారు. కంటి పరీక్షలు నాణ్యతతో చేయడం ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. జిల్లా సీనియర్ వైద్య శాఖ అధికారి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. బృందం కంటి వెలుగు శిబిరాన్ని ఉ. 9.00 గంటల నుండి సా. 4.00 గంటల వరకు సోమవారం నుండి శుక్రవారం వరకు వారానికి 5 రోజులు నిర్వహించాలన్నారు. బృందాలకు రోజువారీ భోజన ఖర్చులకు రూ. 1500 లు





జిల్లా వైద్య, ఆరోగ్యాధికారికి మొత్తం పంపినట్లు, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అట్టి మొత్తం పంపిణీ చేయాలన్నారు. బృందానికి రవాణా కొరకు అద్దె కారు కు అనుమతించినట్లు ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్, కంటి స్క్రీనింగ్ తదుపరి రెండుసార్లు డాటా నమోదు చేయాల్సి ఉంటుందని, నమోదులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఎడిఎం, డీడీఎం, ఏఎన్ఎం బృంద సిబ్బందికి శిక్షణ ఏర్పాటుచేసి పూర్తి చేయాలన్నారు. లేటెస్ట్ వర్షన్ యాప్ ఇన్స్టాల్ చేసుకోవాలన్నారు. శిబిరం వద్ద క్యూ లైన్ పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు కార్యక్రమం పూర్తి కాగానే ఇంవెంటరీ మాడ్యూల్ లో వివరాలు నమోదు చేయాలని, ఎన్ని రకాల, ఎన్ని కళ్ళజోళ్ళు ఇచ్చినది, మిగులు, ఇంకా అవసరాలు నమోదు చేయాలని అన్నారు. ఏఆర్ మిషన్లు మంచి స్థితిలో ఉండాలని, అన్ని పరికరాలు ముందస్తుగా చూసుకొని ఎన్నికల సన్నద్ధంలా ఒకరోజు ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో శిబిరం కేంద్రాల వద్ద టెంట్, త్రాగునీరు, కుర్చీలు, టేబుళ్ల అన్ని మౌళిక వసతుల కల్పన చేయాలన్నారు. శిబిరం ప్రారంభోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి ప్రజల సేకరణ ఎంతో ముఖ్యమని ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో ప్రతిరోజు 120 మంది పరీక్షలకు వచ్చేట్లు చూడాలన్నారు. ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేసి, అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేయాలన్నారు.సమీక్ష లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ శ్వేతా మహంతి మాట్లాడుతూ, డిఎంవో, డాటా ఎంట్రీ వారు ఎంతో ముఖ్యమని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు నాయకత్వంతో ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, శిబిరం బృంద, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. బఫర్ సిబ్బంది, మెటీరియల్ అందుబాటులో ఉంచుకో వాలన్నారు. సమస్యలు వస్తే, అర గంటలో రీప్లేస్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకో వాలని, పీఆర్, మునిసిపల్ అధికారులు కార్యక్రమంలో పాలుపంచుకోవాలని ఆమె తెలిపారు. ఇన్వెంటరీ ని నమోదు చేస్తూ, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమ నిర్వహణ చేయాలన్నారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, ఆదేశాల ప్రకారం చర్యలు చేపట్టి కార్యక్రమం విజయవంతం



చేస్తామన్నారు. సూక్ష్మ ప్రణాళిక రూపొందించి అమలుచేస్తామన్నారు. జిల్లా, మండల స్థాయిల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్ సమావేశాలు నిర్వహించి, షెడ్యూల్ అందజేసినట్లు ఆయన అన్నారు. అన్నిరకాల చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తామన్నారు.కార్యక్రమంలో వైద్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని, వ్యక్తిగత శ్రద్ధతో చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి జిల్లా స్థాయిలో, వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో నాయకత్వం వహించాలన్నారు. అన్ని ఏర్పాట్లు రెండు రోజుల్లో పూర్తి చేసుకొని, సన్నద్ధంగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని ఆయన తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణ తో రోజువారి ప్రజాసేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఎంసిహెచ్, ఎన్సీడి, ఇమ్యునైజేషన్ తదితర సేవలు ఆగకూడదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎంఐ డిసి ఎండి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇన్వెంటరీ స్టాకును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అవసరాలను ముందస్తుగా తెలిపితే సరఫరా కు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఆర్ మిషన్లలో లోపం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, టెక్నీషియన్లను పంపి సరిచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, జెడ్పి సిఇఓ వి.వి. అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి పుల్లారావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. రాంబాబు, వైద్య ఆరోగ్య ప్రాజెక్ట్ అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రను మార్చే సువర్ణ యుగం బిఆర్ఎస్ తోనే సాధ్యం..

**-బీజేపీ వ్యతిరేక శక్తులందరినీ ఏకం చేసేందుకు బీఆర్ఎస్ బృహతరమైన నిర్ణయంతో ఖమ్మం జిల్లా వేదికగా ఏకం కానున్న జాతీయ నేతలు..**

**-బహిరంగసభకు ఇల్లందు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలి రావాలి..**

**-ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, ఎమ్మెల్సీ తాతామధు పిలుపు**





**(ఇల్లందు-విజయంన్యూస్)**
ఈనెల 18వ తారీఖున ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో ఇల్లందు నియోజకవర్గ ప్రజలను భాగస్వాములు చేసి సభను విజయవంతం చేయవలసిందిగా స్థానిక శాసన సభ్యురాలు హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ హాజరైయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేసే విధంగా ఇల్లందు నియోజకవర్గం నుండి 50 వేల మందిని తరలిస్తామని హరిప్రియ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ:- తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మన దేశ ప్రజలకు అందించేందుకు గౌర ముఖ్యమంత్రి కేసీఆర్ గారు బిఆర్ఎస్ పార్టీని స్థాపించారని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు, దళిత మైనార్టీ సోదరులకు నిరుపేదలకు అందుతున్న సంక్షేమ పాలన యావత్ దేశ ప్రజలకు చేరాలని తన బలమైన ఆకాంక్షతో వివిధ పార్టీల అధినేతలు గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి అడుగుజాడల్లో పయనించేందుకు సిద్ధమయ్యారని ఈనెల 18వ తారీఖున ఖమ్మం జిల్లాలో నిర్వహించే బహిరంగ సభ తో యావత్ దేశ ప్రజలకు దిక్సూచిని తెలియజేసే విధంగా కేసీఆర్ నాంది పలకనున్నారని తెలిపారు. దేశ రాజకీయాల్లో రాణించే విధంగా కేసీఆర్ సంకల్పం నెరవేరే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కి తెలంగాణ బిడ్డలంతా అండగా ఉండి మద్దతు తెలిపే విధంగా దోహదపడాలని వారు కోరారు. సభా ప్రాంగణానికి ఉదయం 10:00 గంటల లోపే చేరుకునే విధంగా ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుండి బయలుదేరాలని, బాధ్యత తీసుకున్న ప్రతి ఒక్కరు బహిరంగ సభ అనంతరం క్షేమంగా నియోజకవర్గానికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తొలి దశ ఉద్యమకారులు భద్రాద్రి జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేంద్ర, రమణగారు, ఇల్లందు మార్కెట్ చైర్మన్ హరి సింగ్, ఇల్లందు నియోజకవర్గ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కూడార్రై ఉత్సవం



**సత్తుపల్లి, జనవరి 11:**
రేజర్ల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో ప్రముఖ ప్రవచనకర్త శ్రీ నల్లన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి వారిచే జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాల్లో 27వ రోజు 108 గంగాళాలతో గోదాదేవి తమిళనాడులోని తిరుమలంజోలై అనే ఊరిలో ఉండే సుందర బాహు స్వామి అనే పేరు కలిగిన భగవంతుడికి ఈ 108 గంగాళాలతో దివ్య పాయస నివేదన చేస్తానని ఆ మొక్కు తీరకుండానే గోదాదేవి స్వామి వారిని తరువాతి కాలంలో వచ్చిన భగవద్ రామానుజాచార్య స్వామి గోదాదేవి మొక్కుని చేర్చారు అని మనకు చరిత్ర చెబుతోంది. మనము కూడా అమ్మవారి తరుపున నిర్వహించే ఉత్సవమే ఈకూడార్రై ఉత్సవం అని రామకృష్ణ ఆచార్య అన్నారు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు, పాల్గొన్నారు

# పోలీస్ స్టేషన్ ను సందర్శించిన డిఐజి



**ఏన్కూర్, జనవరి 11 (విజయం న్యూస్)**
ఏన్కూర్ పోలీస్ స్టేషన్ ను బుధవారం హైదరాబాద్ మల్టీ జోన్ డి ఐ జి షాన్ వాజ్ ఖాసిం సందర్శించారు.కొత్తగూడం వెళుతూ ఏన్కూర్ లో డి ఐ జి కొంచ సేపు ఆగారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ మంచిగా ఉన్నదని అన్నారు. షాన్ వాజ్ ఖా గతంలో ఖమ్మం జిల్లా సిపిగా పనిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్ మల్టీ జోన్ డి ఐ జి గా పనిచేస్తున్నారు.

# తుమ్మల ఇంటికి హరీష్ రావు

## పువ్వాడ, నామా, సండ్రతో కలిసి వెళ్లిన మంత్రి హరీష్
## అసక్తికరంగా మారిన రాజకీయం





**(ఖమ్మంప్రతినిధి, సత్తుపల్లి-విజయంన్యూస్)**

ఖమ్మం జిల్లాలో రోజురోజుకు రాజకీయం రసవత్తరంగా మారుతోంది.. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇప్పటి వరకు వదిలేసి ఎవరిదారి వారే చూసుకున్న బీఆర్ఎస్ పార్టీ అదిష్టానం, ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు తుమ్మల నాగేశ్వరరావు చుట్టు ప్రదక్షణలు చేస్తున్నట్లుగానే కనిపిస్తోంది. ఇటీవలే ఖమ్మంలో జరుగుతున్న రాజకీయ పెనుమార్పుల ఫలితంగా జనబలం ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారే అవకాశాలు ఉండటంతో ఆ స్థాయి కంటే ఎక్కువ జనబలం ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం వదిలిపెట్టేందుకు మక్కువ చూపించడం లేదు. అందుకే హైదరాబాద్ లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఎనలేని ప్రేమను కురిపించారు. సీఎం కేసీఆర్ నేరుగా తుమ్మల నాగేశ్వరరావును వేదికపైకి తీసుకెళ్లగా, మంత్రి కేటీఆర్ అలింగనం చేసుకుని, ఆత్మీయంగా మాట్లాడారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి హరీష్ రావు నేరుగా తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి అలింగనం చేసుకున్నారు. దమ్మపేట మండలం గండుగలపల్లిలోని తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ కలిసి వారితో పాటు సండ్ర వెంకటవీరయ్యను, ఎంపీ నామా నాగేశ్వరరావు, గాయత్రి రవి తీసుకుని వెళ్లడం గమనర్హం.

**సండ్రను కార్లో ఎక్కించుకుని వెళ్లిన మంత్రులు**

ఇటీవలే సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం మరింతగా మాటలతూటాలు పెల్చారు. అయినప్పటికి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ విషయం స్పందించలేదు. ప్రస్తుతం హాట్ హాట్ గా మారిపోతున్న తరుణంలో మంత్రి హరీష్ రావు ఎగిసిపడుతున్న వర్గపోరుకు ఫుల్ స్టాఫ్ పెట్టే ప్రయత్నం చేశాడు. సండ్ర వెంకటవీరయ్యను తన కార్లో ఎక్కించుకుని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి వెళ్లడం గమనర్హం. ఇదే విషయం ఇప్పుడు హాట్ టాఫిక్ గా మారింది. కొంతకాలంగా పార్టీపై అసంతృప్తిగా ఉన్న తుమ్మల నాగేశ్వరావు ఇంటికి మంత్రులు వెళ్లడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తుమ్మల నాగేశ్వరావు ఈసారి పాలేరులో పోటీ చేయడం ఖాయమని ప్రకటించడం.. దానికి తగ్గట్లు నియోజకవర్గంలో పర్యటనలు చేస్తూ ముందుకు వెళ్తున్నారు. అంతేకాదు.. తన అనుచరులను రంగంలోకి దింపి టీడీపీ మద్దతు కోసం ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు అధికార పార్టీ తరఫున తానే పోటీచేస్తానంటూ పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి సైతం ప్రకటనలు చేయిస్తూ నియోజకవర్గంలో కార్యాచరణ ఇప్పటినుంచే మొదలు పెట్టారు. ఈ క్రమంలో తుమ్మల ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారని బీఆర్ఎస్ శ్రేణుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంత్రి తన్నీరు హరీష్ రావు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన ఇంటికి వెళ్లడం పట్ల ఆసక్తికరంగా మారింది. అయితే ఇంటికి వచ్చిన అతిథికి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్వరరావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంత్రులకు, ఎమ్మెల్సీలను ఘనంగా సన్మానించారు.



# కవయిత్రి సునంద, యువ భారత్ శక్తిలకు సృజన ప్రతిభా పురస్కారం

**-సృజన ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం.**



సత్తుపల్లి, జనవరి 11: సృజన సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ పుల్లయ్య మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని చదువుకొని విద్యార్థులు యువత స్పూర్తి పొందాలని కోరారు. పుస్తకాలతో పాటు జీ విత చరిత్రలు కూడా ప్రేరణ కలిగిస్తాయని తెలిపారు. రచయిత్రి వురిమళ్ళ సునంద మాట్లాడుతూ వివేకానందుని జీవితం యువతకు, విద్యార్థులకు దారిదీపం వంటిదని అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉపాధ్యాయిని, ప్రముఖ రచయిత్రి వురిమళ్ళ సునంద, సమాజ సేవలో భాగంగా యువ భారత్ శక్తి క్రాంతి, పర్యావరణ పరిరక్షణ చేస్తున్న ఎంవిఐ పుల్లయ్యలను శాలువా జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సృజన నిర్వాహకులు గట్టె వాసు, జి.రామకృష్ణ, బి.మధుసూదన రాజు, పి.నాగేశ్వరరావు,అయ్యదేవర శేషగిరిరావు మాదిరాజు మాలతి, పి.మల్లికార్జున రావు,సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గిడ్డంగిని తనిఖీ చేసిన కలెక్టర్



**ఖమ్మం, జనవరి 11(విజయంన్యూస్):**

త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ బుధవారం ఈ.వి.ఎం గిడ్డంగిని తణిఖీ చేసారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపబడే పిరియాడికల్ తణిఖీ నివేదిక సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ ప్రాంగణంలో గల ఈ.వి.ఎం గిడ్డంగిని తెరిచి ఈ.వి.ఎంలను పరిశీలించారు. ఈ.వి.ఎం గిడ్డంగుల వద్ద విధులు పోలీసు గార్డ్ హాజరు, సమయపాలన రిజిస్టర్లను కలెక్టర్ తణిఖీ చేసారు. గిడ్డంగిలోని అగ్నిమాపక పరికరాలను పరిశీలించి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారికి సమయం తెలిపి తనిఖీ చేయించాలన్నారు. సిసి ఫుటేజీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ.వి.ఎం గిడ్డంగుల వద్ద విధులు నిర్వర్తించే పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సి.సి.టి.వి కెమెరాల ద్వారా పరిశీలిస్తుండాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.మధుసూథన్, శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా రియల్టర్ అసోసియేషన్ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా 'కాటేపల్లి జనార్ధన్'

## ప్రకటించిన రియాల్టర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు

ఖమ్మం ప్రతినిధి, జనవరి 11 : శక్తి వంచన లేకుండా పనిచేస్తూ, అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం ఉన్న 'కాటేపల్లి జనార్ధన్ రావు' ను ఖమ్మం జిల్లా రియల్టర్ అసోసియేషన్ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాష్ట్ర రియాల్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు ప్రకటించారు. బుధవారం ఖమ్మం నగరంలోని జిల్లా రియాల్టర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు మాట్లాడుతూ..కాటేపల్లి రంగారావు అన్నపూర్ణ దంపతుల రెండవ సంతానంగా ఖమ్మం జిల్లా కొనిజర్ల గ్రామం నందు జన్మించిన కాటేపల్లి జనార్ధన్ చిన్ననాటి నుండే స్వశక్తిగా ఎదగాలని ఆలోచనతో 1989లో ఖమ్మం పట్టణముకు వచ్చి కిరాణా షాప్ తో జీవన సాగిస్తూ ఎంతో మందికి ఉపాధి కల్పించిన సహృదయుడు అన్నారు. 2007వ సంవత్సరం రియల్ ఎస్టేట్ రంగం ఆరంభం నుంచి ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి తను సొంతంగా రెండు వెంచర్లు వేసి ఎంతోమంది రియల్టర్స్ కి ఉపాధి కల్పించిన మానతావాది కాటేపల్లి జనార్ధన్ అన్నారు. అటువంటి వ్యక్తి ద్వారా రాబోయే రోజుల్లో రియాల్టర్ అసోసియేషన్ ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందని గ్రహించే ఖమ్మం జిల్లా రియల్టర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, జిల్లా అధ్యక్షులు అన్నం వీరప్రసాద్ రావు, జిల్లా కమిటీ సమక్షంలో కాటేపల్లి జనార్ధన్ రావుకు బాధ్యతలు అప్పగించామన్నారు.. ఈ సందర్భంగా జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన కాటేపల్లి జనార్ధన్ రావు మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను, అవకాశాన్ని



శక్తివంచన లేకుండా సమర్థంగా తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా రియల్టర్ అసోసియేషన్ ను మొదటి స్థానంలో ఉంచేందుకు జిల్లా కమిటీ సహకారంతో ముందుకు వెలతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రియల్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అల్లిక సంతోష్ యాదవ్, జిల్లా కమిటీ కోశాధికారి బుర్ర సురేష్ బాబు, క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ కుమ్మరి కుంట్ల కైలాష్, జిల్లా రియల్టర్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి మాతంగి అనిల్ కుమార్, ఖమ్మం నగర రియల్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ కె అన్వర్ పాషా, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి పఠన్ జానీ, నగర కమిటీ సభ్యులు పాశం నరేష్, టి రామచందర్, వంగవీటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పువ్వాడ





**ఖమ్మం, జనవరి 11(విజయంన్యూస్):**
సమీకృత జిల్లా కార్యాలయాల నిర్మాణ పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ నెల 18న ముఖ్యమంత్రి చే ప్రారంభోత్సవానికి ఏర్పాట్ల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మిగులు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో ప్రారంభించనున్నట్లు, దీనికి జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రవేశం, ప్రారంభోత్సవం, నిష్క్రమణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, భద్రతాపరంగా అన్ని చర్యలు చేపట్టి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర మేయర్ పునుకొల్లు నీరజ, వరంగల్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనర్లు ఏ.వి. రంగనాథ్, విష్ణు ఎస్. వారియర్, అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.





# సభాస్థలాన్ని పరిశీలించిన ఐజీ, డీఐజీ





**(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)**
ఈనెల18న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్రావు ఖమ్మం జిల్లా కేంద్రంలో పర్యటించనున్ననేపథ్యంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించేందుకు ఖమ్మం నగరానికి చేరుకున్న మల్టీ జోన్ - ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ని పోలీస్ గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసిన పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్...ఆనంతరం రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం వద్ద నిర్మించిన నూతన సమీకృత కార్యాలయాల భవన సముదాయానికి (కలెక్టరేట్) చేరుకున్న ఐజీపీ,డీఐజీ పోలీస్ కమిషనర్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజేయ్ కుమార్ కి మర్యాదపూర్వకంగా కలిశారు.ఆనంతరం మంత్రి పువ్వాడ, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తో కలసి వీవీపీల పర్యాటన, బహిరంగ సభ వేదిక ట్రాఫిక్, పార్కింగ్ హెలిప్యాడ్ ప్రాంతాలను సందర్శించి రూట్ మ్యాప్ పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులు చర్చించారు.





## నేషనల్ కౌన్సిల్ సభ్యులు గా సాంబశివరావు, అజయ్ కుమార్ ఎన్నిక.





**ఖమ్మం, జనవరి 11:**
ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) జాతీయ కార్యవర్గంలోకి జిల్లాకు చెందిన ఇరువురు సీనియర్ జర్నలిస్టు లకు చోటు దక్కింది.హైద్రాబాద్ లోని పటాన్ చెరువులోని జీఎంఆర్ కన్వెన్షన్ హల్ లో సోమవారం నుంచి బుధవారం వరకు జరిగిన టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్), ఐజేయు సభలో ఎన్నుకున్నారు.రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణ అధ్యక్షతన మూడు రోజుల పాటు జరిగిన ఈ మహా సభలో ఇరువురు జర్నలిస్టులను ఎన్నుకున్నారు.జిల్లాకు చెందిన వెన్నబోయిన సాంబశివరావు(టి న్యూస్ ఛానల్ ఉమ్మడి జిల్లాల బ్యూరో ఇంచార్జ్ ),తల్లడ మండలం ఆంధ్రజ్యోతి పత్రిక రిపోర్టర్ దుక్కిదేవర అజయ్ కుమార్ ను ఎన్నుకోవడం జరిగింది.సాంబశివరావు గత 15 ఏళ్లుగా వివిధ చాన్నాళ్లలో పనిచేస్తూ,ప్రస్తుతం టి న్యూస్ బ్యూరో ఇంచార్జ్ గా పని చేస్తున్నారు.దుక్కిదేవర అజయ్ కుమార్ మూడు దశాబ్దాలుగా జర్నలిజం వృత్తిలో ఉన్నారు.వీరు ఇరువురిని జాతీయ కార్యవర్గం లో ఎన్నిక చేయడం జరిగింది. జిల్లా నుంచి జాతీయ కార్యవర్గం లోకి తీసుకోవడం పట్ల టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి లు ఎన్నికయిన ఇరువురికి అభినందనలు తెలియజేశారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని కోరారు.

## సమాజ సేవలో యువ సేవ సమితి పరుగులు



**సత్తుపల్లి, జనవరి 11:**
బుధవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని చిల్డ్రన్స్ హెూమ్ లో పిల్లలకు సత్తుపల్లి పట్టణ ప్రముఖ న్యాయవాది ఆడమ్స్ మూడు రైస్ బ్యాగులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా యువ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ యువ సేవా సమితి 2023వ సంవత్సరం మొదటి కార్యక్రమం ప్రముఖ న్యాయవాది ఆడమ్స్ దాతృత్వంతో ఆశ్రమంలో ఉన్న వారికి రైస్ బ్యాగులు అందించడం. యువత అందరూ చేయి చేయి కలిపి పేదలైన వారికి సహాయం చేయడం కొరకు యువత ముందుండాలని కోరినారు. పేదలైన వారికి సహాయం చేయాలని సంకల్పం ఉన్నవారు యువసేవ సమితి వారిని సంప్రదించవచ్చని తెలియజేశారు. సత్తుపల్లి ప్రాంతాలలో శుభ, అశుభ కార్యక్రమాలలో ఆహారం మిగిలితే సేవా సమితి సభ్యులకు సమాచారం ఇవ్వొచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువసేవ సమితి అధ్యక్షులు పుట్టా నితిన్, ఉపాధ్యక్షులు దుగ్గిరాల పార్టీ నరేష్ కుమార్ నాయుడు , ప్రధాన కార్యదర్శి ఈదుల ప్రిన్స్, కార్యనిర్వాహకుడు షేక్ ఇమ్రాన్, యువ సేవాసమితి డైరెక్టర్లు అయినంపూడి సాయికుమార్, కళాశాల ఇంచార్జ్ దాట్ల రాము, ఫుడ్ ఇంచార్జ్ వేముల మదన్, కిష్టారం ఇంచార్జ్ కేశవరెడ్డి, సేవా సమితి సభ్యులు నాని, గిరి వర్ధన్ రెడ్డి, శివనాగు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9948232815, 90106 47789, 8309153239, 63055 93759 సంప్రదించాలన్నారు.

ఖాళీల వివరాలు :
ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్, ఖమ్మం ఆర్‌సి ఇన్‌చార్జ్, ఖమ్మం నగరం,కార్పో రేషన్, క్రైమ్, ఎడ్యూకేషన్.
పాలేరు నేలకొండపల్లి, ఖమ్మం రూరల్. తిరుమలాయపాలెం
మధిర ముదిగొండ, బోనకల్, చింతకాని, మధిర టౌన్, మధిర ఆర్‌సి ఇన్‌చార్జ్. ఎర్రుపాలెం
సత్తుపల్లి వేంసూర్,
వైరా వైరా టౌన్,సుజాత నగర్, కొణిజర్ల, కారేపల్లి.
www.epaper.vijayamdaily.com
విజయం
అక్షర సమరానికి నాంది
విలేకర్లు కావలెను
సమాజం, స్థానిక రాజకీయ అంశాలపట్ల కనీసం అవగాహ కలిగి ఉండి చక్కని రాత, ఓర్పు , నేర్పు గల జర్నలిస్టులకు విజయం తెలుగు దిన పత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు అసక్తి గల వారు సంప్రదించగలరు.
సంప్రదించాల్సిన నెంబర్: 99129 63565.